# పుట్టగొడుగులు



సాయంత్రం బడివొదిలారు.

పంతులు తన ఇంటివైపు నడుస్తున్నారు. అటువైపు వెళ్ళవల్సిన మరినలుగురు విద్యార్థులు వెనక నడుస్తువున్నారు. వాళ్ల చేతుల్లో పుస్తకాలున్నాయి. ఓమూల మలుపులో గిరి అనే విద్యార్థి ఎదురైనాడు.

"ఏం రా గిరి ఈరోజు స్కూల్‌కు రాలేదేమి ?" అడిగాడు టీచర్.

"బావి దగ్గరికి వెళ్లాను సార్"

"మరి బడి ఎటుపోవాలిరా"

"బావి దగ్గర పండగ అయితే మానాన్న రమ్మన్నాడు సార్"

"బావి దగ్గరం ఏం పండగర".

"ఉప్పలమ్మ పండగసార్. మా పశువుల దొడ్డి వెనక ఉప్పలమ్మ మొలిచింది".

"అయితే"? పంతులు ప్రశ్నించాడు.

"మొలిస్తే, ఏడురోజులు ఓ కొత్తగంప దానిమీద కప్పి, పసుపు కుంకుమ చల్లి వుంచి, ఆ తరువాత గుడి కట్టింద్రు సార్".

"కట్టి"

"కట్టి, సున్నం వేసి, పసుపు కుంకుమ బొట్లు పెట్టి, తెల్లవారుజామున ఓ మేకపోతును నర్కి పండగ చేసింద్రు సార్"

"ఛో ఛో, ఎంత అమాయకుడు మీనాయన" అన్నాడు.

గిరికి ఏమి అర్థంకాక నిలుచుండిపోయాడు. 'మా నాయన ఒక్కడే అట్ల చేసిండా పక్కబాయి దగ్గర పేడకుప్ప దగ్గర అట్లనేచేయిలాగ మొలిస్తే పండగచేసిరి. వాళ్లంత అమాయకులా?' తనలో తాను అనుకున్నాడు.

"మా ఊరిలో చేయిమొలిచితే అందరు అట్లనే పండగచేస్తరు సార్" అన్నాడు బయటికి.

"మీ ఊరివాళ్లకు సైన్స్ తెలియదుర".

"సార్" టీచర్ చెప్పేది వింటునిలుచున్నాడు. మిగతా విద్యార్థులూ వింటున్నారు.

"పిల్లలూ, ఆ పెంట దిబ్బ వైపు చూడండి, యిటువైపు పాత గోడవైపు చూడండి" అన్నాడు. అందరు అటు పెంటదిబ్బ వైపు, పాతగోడవైపు చూశారు.

"మీకు ఏంకనిపిస్తున్నాయి."

"పుట్టగొడుగులు" అన్నారు.

"పుట్టగొడుగులను చూశారుకదా"

చూశాం అన్నట్లు తలలూపారు.

"అవి ఎట్లా వున్నాయి"

"కొన్ని వాడిపోతున్నాయి. మరికొన్ని కొత్తగ వెలుస్తున్నాయి."

"వాడిపోయేవాటిమీద ఏం వాలుతున్నాయి".

"ఈగలు సార్"

" అది. పుట్టగొడుగులు వాడిపోతే ఈగలు వాలుతాయి. అన్ని పుట్టగొడుగులు ఒకే లాగ వుండవు. కొన్ని విషపూరిత

వాసనలు వొదులుతాయి. అట్టి విషపూరిత గాలిని పీల్చిన యెడల మనిషి ఆరోగ్యం చెడిపోతుంది".

"ప్రత్యేకంగా చేయి అకారంలో మొలిచే ఆ పుట్టగొడుగు సంతతి విష వాయువును వదులుతుంది. దానిని మనం పీల్చరాదు. ఈ విషయాన్ని విడమర్చి చెప్పక మన వాళ్లు, అది ఓ దేవుడని, దయ్యమని చెప్పి దాని దరిదాపులోకి పోకుండా చేస్తారు". అన్నాడు మళ్లీ తానే టీచర్.

"సార్ మరి పండగ చేస్తే ఏంకావటం లేదు కదా".

"ఏం కాదు. పండగ పేరుమీద దానిమీద పసుపు చల్లుతారు. కుంకుమ చల్లుతారు. నిమ్మకాయలను కోసివేస్తారు, సాంబ్రాణి పొగవేస్తారు. అది ఎవరికంట పడకుండ ఓ కొత్త గంపకప్పుతారు. ఆ తరువాత అదినశిస్తుంది. దానితోపాటు దాని చెడు లక్షణాలు నశిస్తాయి." పిల్లలు చేతులు కట్టుకుని శ్రద్ధగ వింటున్నారు.

"ఆ ప్రాంతంలో మళ్లీ మొలిచే అవకాశం వుంది. కనుక గుడికట్టి అప్పుడప్పుడు పసుపు, కుంకుమ చల్లుతు వుంటారు. ఏటేట పండగ చేస్తువుంటారు అది సంగతి". విద్యార్థులు కొత్త విషయం తెలుసుకున్నట్టు ఊపిరి పీల్చారు.

"చెప్పొచ్చేదేమిటి అంటే ఉప్పలమ్మ లేదు. అది దేవుడు కాదు. అదొక రకమైన పుట్టగొడుగె" అప్పుడే అటువైపు వచ్చిన యాదగిరి తండ్రి పంతులు చెపుతున్న ఆకరిమాటవిని -

"మరి అది మొలిచినపుడు దానిని ముట్టుకున్నోళ్లు అక్కడికక్కడే రక్తం కక్కి సచ్చినోళ్ల సంగతి" అన్నాడు.

"అట్లా ఎవరన్న చచ్చారా ?"

"ఎందుకు సావలేదు. మావూరిలో గూడ మస్తుగ సచ్చింద్రు. అందుకే పండగసేయడం" అన్నాడు గిరి తండ్రి.

"నేను ఇంతకుముందే మీరు రాకముందే చెప్పాను అది ఓ

విధమైన విషపుసూక్ష్మక్రిములను వొదులుతుంది. దానిని పీల్చితే మీరు చెప్పినవి సంభవించవచ్చు". అన్నాడు మళ్లీ.

"అంటే దానిగాలిలో అంత విషం వుంటదా సారూ" అన్నాడు గిరి తండ్రి.

"మల్లె చెట్టు మంచి వాసన వెదజల్లినట్టు, పుట్టగొడుగులు కొన్ని చెడువాసన వెదజల్లుతువుంటాయి. మరికొన్ని రకాల పుట్టగొడుగులను మనం తింటాం. మరి యిప్పుడు వాటిపెంపకం ఓ పరిశ్రమగ మారింది" అన్నాడు.

అట్లనా అన్నట్టు ఒకరినొకరు చూసుకుంటు అక్కడినుండి కదిలారు.

తెలియకముందు అంతా నలుపు.

తెల్సినంక అదే తెలుపు.

మనిషి చేయవల్సిందల్లా తెలుసుకునే ప్రయత్నం చేయాలి. అందుకు చదువుకోవాలి మరి !